సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 25 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 24.445 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,081 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో జలాశయానికి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,280
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,503
3శాతం జీఎస్టీతో	రూ.5,668
నవర (8గ్రా)	రూ.45,344

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.9 /26.4

సోమవారం గాలిలో తేమ 97 శాతం ఉంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురుస్తుందని, చలిగాలులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్


సెమీ ఫైనల్స్‌కు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



మిక్స్‌డ్ డబుల్స్ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజు సోమవారం హోరాహోరీగా జరిగాయి. ప్రీక్వార్టర్స్, క్వార్టర్ ఫైనల్స్‌లో బాలబాలికలు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మొత్తం 60 మ్యాచ్‌లు ఆడారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో నెల్లూరు, విశాఖపట్నం, ప్రకాశం, కడప, కృష్ణా, కర్నూలు జిల్లాల జట్లు ముందంజలో ఉన్నాయి. మంగళవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఏపీ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటశ్రీకాంత్, సభ్యులు రామ్మోహన్, వరప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్‌గా ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ఎంపీ వి. విజయసాయిరెడ్డిని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు ఆయన నెల్లూరుతోపాటు నర్సారావుపేట, బాపట్ల, ఒంగోలు, తిరుపతి(సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు) జిల్లాలకు రీజినల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు.

డీఎల్‌డీఓ సరెండర్

నెల్లూరు(పొగతోట): డీఎల్‌డీఓ కనకదుర్గభవానిని సరెండర్ చేస్తూ పోస్టింగ్ కోసం ప్రభుత్వానికి రిపోర్టు చేసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం



విజయకుమారి

నెల్లూరు(లీగల్): నెల్లూరు మొదటి అదనపు జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు, న్యాయవాది మాలాపాటి వెంకటవిజయకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె విద్యుత్‌శాఖకు చెందిన కేసులను ప్రభుత్వం తరఫున వాదిస్తారు. మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆమెకు అభినందనలు తెలిపారు. వెంకటవిజయకుమారి మాట్లాడుతూ తనను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించేందుకు సహాయ సహకారాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి ఆర్.రోజారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

టీవీ5పై కేసు నమోదు

- తప్పుడు స్క్రోలింగ్‌లు ప్రసారం చేసినందుకు..

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి(జీజీహెచ్)పై నమ్మకం పోయేలా తప్పుడు స్క్రోలింగ్‌లు ప్రసారం చేసిన టీవీ5 చానల్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జీజీహెచ్‌లో ఈ నెల 21వ తేదీన వివిధ వ్యాధులతో చికిత్సపొందుతూ ఆరుగురు మృతిచెందగా, ఆక్సిజన్ అందక 8 మంది చనిపోయారంటూ ఈ నెల 22వ తేదీన టీవీ5 చానల్‌లో స్క్రోలింగ్‌లు ప్రసారమయ్యాయి.

జీజీహెచ్‌పై ప్రజలకు నమ్మకం పోయేలా దురుద్దేశపూర్వకంగా టీవీ5 చానల్ తప్పుడు ప్రచారాలు చేసిందని, సదరు చానల్‌పై చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్దానాయక్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం టీవీ5 చానల్‌పై 505(2), 120(బి), r/ w 34 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

హోరాహోరీగా తలపడుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు



క్రీడోత్సాహం

వందల మంది క్రీడాకారులు.. అందరి లక్ష్యం ఒక్కటే.. గెలుపు తీరాలను చేరడం.. ఇందుకోసం అలుపెరగని సాధన చేసి సత్తా చాటేందుకు క్రీడోత్సాహంతో ముందుకుసాగుతున్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు పోటీ పడుతున్నారు. కొందరు విజయతీరాలకు చేరుకోవాలని పోటీపడుతుంటే.. మరికొందరు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రికార్డులు నెలకొల్పేందుకు ప్రత్యర్థి జట్లతో హోరాహోరీగా తలపడుతున్నారు.

నెల్లూరులో బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలు

- పాల్గొంటున్న 500 మంది క్రీడాకారులు
- గెలుపే లక్ష్యంగా తలపడుతున్న 13 ఉమ్మడి జిల్లాల ఆటగాళ్లు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు(బాలబాలికలు) బ్యాడ్మింటన్ అండర్–17 విభాగంలో తమ సత్తా చాటుతున్నారు. తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రత్యర్థి జట్లతో హోరాహోరీగా పోటీపడుతున్నారు. ఎన్నో ఏళ్ల సాధనతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ జాతీయస్థాయిలో రాణించేందుకు ఆటలో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. కొందరు తమ ర్యాంకును మెరుగుపరుచుకునేందుకు ఆటపై దృష్టి సారిస్తున్నారు. క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇవ్వడంలో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. టోర్నమెంట్ నిర్వహణకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక కోర్టులతో క్రీడాకారులకు, వచ్చిన అఫిషియల్స్‌కు సదుపాయాలను కల్పించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ పోటీల్లో పాల్గొంటున్న కొంతమంది క్రీడాకారుల మనోగతాలు వారి మాటల్లోనే..

ప్రపంచస్థాయి క్రీడాకారిణిని అవుతా



ప్రపంచస్థాయిలో ప్రస్తుతం నా ర్యాంక్ 705. రెండు అంతర్జాతీయ, 10 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. జాతీయస్థాయిలో నా ర్యాంక్ 51. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే బ్యాడ్మింటన్ క్రీడలో రాణిస్తున్నాను. ఎక్కడ టోర్నమెంట్ జరిగినా అమ్మ లక్ష్మి నాకు తోడుగా వస్తుంది. 2019లో యంగ్ చాంప్స్ విన్నర్‌గా నిలిచారు. ఐడీబీఐ స్పాన్సర్‌షిప్ లభించింది. ఒలింపిక్ తదితర ప్రపంచస్థాయి రికార్డులను నెలకొల్పాలనేది నా ఆకాంక్ష.

– స్ఫూర్తి, అనంతపురం

బ్యాడ్మింటన్‌లో రాణిస్తూ ఐఏఎస్‌ను అవుతా



నేను, నా తమ్ముడు బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాం. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాను. బ్యాడ్మింటన్ క్రీడలో రాణించడంతోపాటు ఐఏఎస్ అధికారి కావాలని కోరిక. మొత్తం 10 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఒలింపిక్స్, ప్రపంచస్థాయి పోటీల్లో రాణించడంతోపాటు క్రీడాకారులు చదువులో కూడా ఉన్నతస్థానాలకు ఎదుగుతారని నిరూపిస్తా.

– కోట సాయి సాహిల్, గుంటూరు



ప్రత్యర్థితో పోటీపడుతున్న క్రీడాకారుడు

ఉత్తమ క్రీడాకారులను అందించడమే ధ్యేయం



ఉత్తమ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి అందించడమే ధ్యేయం. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా షెడ్యూల్ మాత్రమే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రోత్సాహంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరో రెండు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కొత్తగా కలిగింది. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. కుల, మత, రాజకీయాలకతీతంగా క్రీడల్లో రాణిస్తే ఆరోగ్యవంతమైన నవ సమాజం భావితరాలకు చేరువవుతుంది.

– ముక్కాల ద్వారకానాథ్, ఏపీ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు

బ్యాడ్మింటనే సర్వం



మూడో తరగతి నుంచి బ్యాడ్మింటన్ క్రీడ ఆడుతున్నాను. ప్రస్తుతం పదో తరగతి. 2022లో ఆలిండియా నేషనల్స్‌లో మూడోస్థానం సాధించాను. ఒడిశాలో మెయిన్ నేషనల్స్ ఆడాను. ఇప్పటి వరకు 6 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ప్రపంచస్థాయిలో రాణించి బ్యాడ్మింటన్‌లో ఉన్నతస్థానానికి ఎదుగుతాను.

– పి.బాలప్రణయ్, విశాఖపట్నం

వరల్డ్ చాంపియన్‌షిప్ సాధిస్తా



పీవీ సింధు స్ఫూర్తితో బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నా. ఇప్పటి వరకు 6 నేషనల్స్‌లో ఆడా. ప్రతి ఏడాది ఆట తీరును మెరుగుపరుచుకుంటున్నా. ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సాధించాలన్నదే నా ఆకాంక్ష. టోర్నమెంట్లు ఎక్కువగా ఆడడం వల్ల క్రీడల్లో త్వరగా నైపుణ్యం సాధించవచ్చు. నెల్లూరులో టోర్నీ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఏర్పాట్లు బాగున్నాయి.

– పూజిత, కడప

దేశం పేరు నిలబెడతా



బ్యాడ్మింటన్ ఆడడం 2018లో ప్రారంభించా. ఇప్పటికి 5 నేషనల్స్‌లో ఆడాను. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే బాడ్మింటన్‌లో రాణిస్తున్నా. ఎప్పటికప్పుడు ఆట తీరును మెరుగుపరుచుకునే అవకాశాలు లభిస్తున్నాయి. అంతర్జాతీయస్థాయిలో నంబర్–1 క్రీడాకారిణిగా నిలిచి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తెస్తాను.

–పి.అనూరాధ, విజయవాడ

పరిశ్రమలకు నిరంతర విద్యుత్

- ఏపీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పరిశ్రమలకు ప్రత్యేక లైన్ల ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆయన పలు విద్యుత్ సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. మనుబోలు, నవలాకులతోట, ఏకే నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్లలో ఎనర్జీ మీటర్స్, బ్రేకర్స్ పని చేస్తున్నాయా, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ సరిపోతుందా, ఎనర్జీ ఆడిట్ ఎలా ఉంది, విద్యుత్ లోడ్ ఎంత వస్తుందంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్‌కు సంబంధించిన మెయింటెనెన్స్ రిజిస్టర్, లాగ్‌బుక్, వినియోగదారుల రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌స్టేషన్లలో మొక్కలు నాటారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు రామసింగ్, వెంకటరామిరెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, డైరెక్టర్ సుబ్బరాజు, ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, చీఫ్ ఇంజినీర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య, ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈలు ఇస్మాయిల్, సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, మధు, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు ఉన్నారు.



మనుబోలు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏపీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ తదితరులు

రొట్టెల పండగకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు
- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రొట్టెల పండగ సందర్భంగా బారాషహీద్ దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై ఈ నెల 29వ తేదీ నుంచి నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలో జరగనున్న రొట్టెల పండగ సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రొట్టెల పండగ ఏర్పాట్లకు సంబంధించి ఏ శాఖకు కేటాయించిన విధులను ఆ శాఖ బాధ్యతతో, నిబద్ధతతో విధులను నిర్వర్తించి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసుశాఖతో సమన్వయం చేసుకుని నెల్లూరు నగరంలో రూట్ల వారీగా ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎంకు సూచించారు. దర్గా ప్రాంతంలో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు పక్కాగా చేపట్టాలని పురపాలకశాఖ అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు సూచించారు. రెస్క్యూ టీమ్‌లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో అసౌకర్యం లేకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు తెలిపారు. అవసరమైన వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 104, 108 వాహనాలతోపాటు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. స్వర్ణాల చెరువులో నీరు సమృద్ధిగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అవసరమైన బోట్లను, ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో రూట్ మ్యాప్‌లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు తెలిపారు. పోలీసు, అగ్నిమాపక, పురపాలక, విద్యుత్ శాఖల అధికారులు ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని సూచించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ రొట్టెల పండగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, అడిషనల్ ఎస్పీ హిమవతి, ఆర్డీఓ మలోల, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నిర్మలాదేవి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

తనిఖీలు నిల్.. మోసాలు ఫుల్

జిల్లాలోని కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడడం.. నాణ్యత లేని, కల్తీ సరుకుల విక్రయం ద్వారా వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. తరచూ తనిఖీలతో మోసాలకు చెక్ పెట్టాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

▶▶ మనుబోలుకు చెందిన మునేంద్ర నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు ఉదయం బైక్‌పై నెల్లూరుకు వచ్చి రాత్రికి తిరిగి ఇంటికి వెళుతుంటాడు. రెండ్రోజుల క్రితం అయ్యప్ప గుడి సమీపంలోని పెట్రోల్ బంకులో రూ.200కు పెట్రోల్ పోయించుకుని ఇంటికి బయలుదేరగా కొద్దిదూరం వెళ్లగానే పెట్రోల్ రిజర్వ్‌లో పడింది. బైక్‌ను నిలిపి ట్యాంకులో పెట్రోల్‌ను పరిశీలించగా తగ్గించి పోశారని అర్థమైంది. ఇదే విధంగా నగరంలోని పలు పెట్రోలు బంకుల్లో రీడింగ్‌ల్లో మోసాలకు పాల్పడుతూ తక్కువగా పెట్రోల్ పోస్తున్నారని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు.

▶▶ రాజుపాళేనికి చెందిన మస్తాన్‌వలి చిరుద్యోగి. ఇటీవల బక్రీద్ పండగకు స్టోన్‌హౌస్‌పేటలో సరుకులు తీసుకెళ్లాడు. నాణ్యమైన సరుకులు ఇవ్వమని కోరగా సరేనన్న వ్యాపారి కట్టించి పంపించాడు. ఇంటికి వెళ్లి పరిశీలిస్తే సరుకుల్లో పురుగులు, రాళ్లు ఉన్నాయి. తిరిగి వచ్చి అడగగా మేం నాణ్యమైనవే కట్టి పంపించామని వ్యాపారి వాదించడంతో చేసేది లేక సరిపెట్టుకున్నాడు. అప్పట్నుంచి కిరాణా దుకాణాల్లో సరుకులు కొనేటపుడు జాగ్రత్త పడుతున్నాడు.



నెల్లూరు(పొగతోట): జిల్లాలోని నిత్యావసర సరుకుల దుకాణాలు, పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసాలతో వినియోగదారులు ప్రతినెలా కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కొలతలు, తూకాల్లో తేడాలకు పాల్పడుతుండగా, మరికొందరు వంటనూనెలు, పెట్రోల్, డీజిల్‌లో కల్తీలకు పాల్పడుతూ వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతూ రోగాల బారిన పడడానికి కారకులవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కల్తీ లేని వస్తువంటూ లేదు. నాణ్యమైన వస్తువులను పక్కన పెట్టి నాణ్యతలేని, కల్తీ సరుకులను వినియోగదారులకు విక్రయిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లోని పంపుల్లో తేడాలు ఉంటున్నాయి. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితేనే అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. లేకుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా అధికారులు మామూళ్లు తీసుకుని మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోల్ బంకుల్లో భారీస్థాయిలో అక్రమాలు జరుగుతున్నా అధికారులు ఈ మధ్య కాలంలో ఒక్క కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. జిల్లాలో 210 పెట్రోలు బంకులు ఉన్నాయి. నిత్యం 5 లక్షల లీటర్ల పెట్రోలు, 8 లక్షల లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయి. పెట్రోలు కల్తీతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ముత్తుకూరుకు వెళ్లే మార్గంలో పెట్రోల్ కల్తీ చేసి ట్యాంకర్ల ద్వారా బంకులకు సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నగరంలోని మినీబైపాస్, అయ్యప్పగుడి, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాలల్లో పెట్రోలు కల్తీ చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించకపోవడంతోనే కల్తీలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం



మోసాలకు పాల్పడుతూ వినియోగదారులను నష్టపరిచే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. దుకాణాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి వినియోగదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకుంటాం. పెట్రోల్ బంకుల్లోనూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం. తుకాల్లో తేడాలతో, కల్తీలతో సరుకులు విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

అధికారులు చర్యలు తీసుకోవాలి



వ్యాపారులు ప్రతి వస్తువును కల్తీ చేసి వినియోగదారులను తీవ్రంగా నష్టపరుస్తున్నారు. పెట్రోల్, డీజిల్, ఆయిల్.. ఇలా అన్నింటినీ కల్తీ చేస్తున్నారు. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా కల్తీ సరుకులను వినియోగదారులకు అంటగడుతున్నారు. నిత్యావసర సరుకులను కల్తీ చేసే వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. వినియోగదారులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.మల్లి, డీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు

తూకాల్లో మోసాలు



వినియోగదారులకు నాసిరకం వస్తువులు అంటగట్టడమే కాకుండా తూకాల్లోనూ మోసాలకు పాల్పడుతున్నారు. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించకపోవడంతో వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ బంకుల్లో కొలతల్లో తేడాలు, నిత్యావసర సరుకుల్లో తూకాలు తక్కువగా ఉంటున్నాయి. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని తనిఖీలు నిర్వహించాలి.

– సుబ్బారావు, కొండబిట్రగుంట

ఆర్చరీ క్రీడాకారులకు అభినందన



సన్మానం అందుకున్న ఆర్చరీ క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా నుంచి అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన క్రీడాకారులు తిరుమూరు గణేష్ మణిరత్నం, చాట్ల అజయ్‌మహదేవ్, యశ్వంత్‌రెడ్డిలను జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారులు, ఆ అసోసియేషన్ నాయకులు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పావురాల వేణు చీఫ్ కోచ్ యతిరాజ్, ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆనం మహేష్‌రెడ్డి, కె.గురుప్రసాద్, ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భారత ప్రభుత్వం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన వారికి అందించే పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సెట్నల్, డీఎస్‌ఏ ఇన్‌చార్జి సీఈఓ వి.నాగరాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించిన అర్హులైన క్రీడాకారులు తమ వివరాలను పొందుపరుస్తూ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను వర్డ్, పీడీఎఫ్ ఫార్మాట్‌లలో sportsinap@gmail.com, incentives.schemes@gmail.comలకు ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పంపాలని తెలిపారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులకోసం సంప్రదించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

అనంతపురం, నెల్లూరు జట్ల గెలుపు

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా జరుగుతున్న సీనియర్ అంతర జిల్లాల క్రికెట్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన రెండో రౌండ్ వన్డే మ్యాచ్‌ల్లో అనంతపురం, నెల్లూరు జట్లు గెలుపొందాయి. తొలిమ్యాచ్‌లో వైఎస్సార్, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. 35.4 ఓవర్ల వద్ద 119 పరుగులకు కడప జట్టు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లకే ఒక వికెట్ నష్టానికి 120 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో మ్యాచ్ అనంతపురం, చిత్తూరు జట్ల జరిగింది. ఇందులో అనంతపురం జట్టు గెలిచింది.

బంగారం, వెండి, నగదు చోరీ


ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై వీరప్రతాప్

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని హరివిల్లు లేఅవుట్‌లో ఉన్న ఓ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. లేఅవుట్‌లో ఉంటున్న రత్నయ్య అనే వ్యక్తి ఆదివారం రాత్రి తన బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమ వారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. బీరువా తలుపులు పగులగొట్టి ఒకటిన్నర కేజీ వెండి ఆభరణాలు, రెండు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదును దుండగులు చోరీ చేసినట్లు గుర్తించాడు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అభివృద్ధి పరుగులు

కందుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భారీ ప్రాజెక్టులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పట్టాలెక్కాయి. ప్రధానంగా రామాయపట్నం పోర్టు, జాతీయ రహదారి నిర్మాణం, పట్టణంలో మౌలిక వసతులు, ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి వంటి పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. ఎయిర్‌పోర్టు, భారీ పరిశ్రమల స్థాపన వంటి పనులు పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల నారా లోకేశ్ కందుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.


రామాయపట్నం పోర్టు నిర్మాణం

- కందుకూరు నియోజకవర్గంలో రామాయపట్నం పోర్టు, జాతీయ రహదారి నిర్మాణం
- రూ.20 కోట్లతో విక్కిరాలపేట రోడ్డు డబుల్‌రోడ్డుగా మార్పు
- పోర్టు నిర్మాణంతో పారిశ్రామిక అభివృద్ధి వైపు అడుగులు
- తెట్టు వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వేగంగా భూసేకరణ
- పట్టణంలో రూ.32 కోట్లతో మౌలిక వసతులు

కందుకూరు: కందుకూరు నియోజకవర్గం ప్రస్తుతం అభివృద్ధికి రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అనేక పనులు జరుగుతున్నాయి. అయితే ఇటీవల నియోజకవర్గంలో పాదయాత్ర చేసిన టీడీపీ నాయకుడు లోకేశ్ కందుకూరులో అభివృద్ధి జరగడంలేదని మాట్లాడారు. ఆయన క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోకుండా చెప్పినట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కళ్లముందే అభివృద్ధి కనిపిస్తున్నా మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలపై మండిపడుతున్నారు.

పోర్టు నిర్మాణం

రామాయపట్నం పోర్టు నిర్మాణం రెండు దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల కలగానే మిగిలిపోయింది. 2019 ఎన్నికలు సమీపించడంతో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునాయుడు పోర్టుకు శంకుస్థాపన చేసి హడావుడి చేశారు. అప్పటికి కనీసం నిర్మాణం ఎక్కడ చేయాలి?, భూముల గుర్తింపు వంటి ప్రక్రియ కూడా చేపట్టలేదు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఆలోచనతో ఆరునెలల ముందు పైలాన్ ఆవిష్కరించి మోసం చేసే ప్రయత్నం చేశారు. కానీ నియోజకవర్గ వర్గ ప్రజలు బాబు మోసానికి సరైన గుణపాఠం చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. భూసేకరణతోపాటు అన్ని అనుమతులు పూర్తి చేసిన తర్వాత గతేడాది జూలై 20న పోర్టు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తొలిదశలో రూ.3,736 కోట్లతో ఖర్చుతో 25 మిలియన్ టన్నుల కార్గో కెపాసిటీతో నాలుగు బెర్తుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మొదటి షిప్‌ను నిలపాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానరు. ఈలోపే జేఎస్‌డబ్ల్యూ కంపెనీ మరో రెండు బెర్తులు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించి కేబినెట్ తీర్మానం చేశారు. ఇలా రూ.10 వేల కోట్లతో పది బెర్తుల భారీ పోర్టుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

రూ.32 కోట్లతో..

నియోజకవర్గ కేంద్రమైన కందుకూరు పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీలు తదితర వాటికి ముఖ్యమంత్రి భారీగా నిధులు విడుదల చేశారు. రామాయపట్నం పోర్టు భూమిపూజ సభలో ప్రకటించిన విధంగా రూ.26.85 కోట్లను మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ఇచ్చారు. వీటికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు మరో రూ.5 కోట్లతో కలిసి మొత్తం రూ.32 కోట్లతో 174 పనులు ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్నాయి. వీటితో పట్టణంలో డ్రెయినేజీలతో పాటు, సీసీ రోడ్లు వంటి పనులు సాగుతున్నాయి. పామూరు బస్టాండ్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయవనరుల కల్పనకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇలా పట్టణంలో వసతులకు పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తున్నారు.

విక్కిరాలపేట రోడ్డుకు..

విక్కిరాలపేట రోడ్డు.. ఇది కందుకూరు, కొండపి నియోజకవర్గాలను అనుసంధానం చేస్తుంది. 11.54 కి.మీ మేర పొడవున్న ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీని పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇది పూర్తయితే రెండు నియోజకవర్గాల్లోని గ్రామాల మధ్య మెరుగైన రహదారి వ్యవస్థ ఏర్పడనుంది.

ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి

నియోజకవర్గంలో సాగునీటి చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.కోట్లు ఖర్చు చేశారు. వీటిలో ప్రధానంగా రాళ్లపాడు ప్రాజెక్టు తర్వాత అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధి చెందిన మాచవరం, మోపాడు చెరువులను రూ.18.70 కోట్ల జికా నిధులతో అభివృద్ధి చేశారు. అలాగే రూ.4.30 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మాచవరం చెరువు 3, 4వ నంబర్ కాలువను పటిష్టం చేశారు. ఇక కొత్తగా కందుకూరు మండలం ఓగూరులో రాళ్లవాగుపై రూ.2.60 కోట్ల నూతన చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తి చేశారు. కోవూరులో పందివాగుపై రూ.2.80 కోట్లతో మరో చెక్‌డ్యామ్ ప్రస్తుతం నిర్మాణం జరుగుతోంది. ఇవే కాకుండా ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాళెం, లింగసముద్రం మండలాల్లోనూ చెరువుల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చించారు.


కోవూరు రోడ్డులో నిర్మిస్తున్న భారీ మురుగునీటి కాలువ

ఏరియా వైద్యశాలలో అదనపు భవనం

ఏరియా వైద్యశాలలో వసతులు మెరుగుపరిచేందుకు రూ.7 కోట్లతో నిర్మించిన నూతన భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు బెడ్స్ ఏర్పాటుకు అవకాశం ఏర్పడుతుంది. అలాగే పట్టణంలో ఒక అర్బన్‌హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తిగా, మరొకటి నిర్మాణంలో ఉంది. ఉలవపాడు మండలంలో సీహెచ్‌సీల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి నూతన భవనాలు ఏర్పాటు చేశారు.


ఏరియా హాస్పిటల్లో నూతనంగా నిర్మించిన అదనపు భవనం

తెట్టు వద్ద విమానాశ్రయం

రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే భూముల పరిశీలన కూడా పూర్తి చేశారు. గుడ్లూరు మండలంలోని మోచర్ల వద్ద ఉన్న అటవీ శాఖకు చెందిన రెండువేల ఎకరాల భూములను గుర్తించి డీ నోటిఫై కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రక్రియ పూర్తయితే విమానాశ్రయం నిర్మాణానికి స్వయంగా సీఎం చేతుల మీదుగా భూమిపూజ చేయించాలనే ఆలోచనలో అధికారులున్నారు.

జాతీయ రహదారి కల సాకారం

జాతీయ రహదారి.. కందుకూరు నియోజకవర్గ ప్రజల కల. 167బీ హైవే నిర్మాణంతో ఇది తీరనుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. కడప జిల్లా మైదుకూరు నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు మొత్తం 189 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మొదటి దశలో చేపట్టిన 45.73 కి.మీ రోడ్డు పూర్తిగా నియోజకవర్గం నుంచే పోతుంది. వలేటివారిపాళెం మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు రూ.210 కోట్ల ఖర్చుతో రోడ్డు పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా కందుకూరు పట్టణానికి దక్షిణం వైపున 8.9 కి.మీ మేర అర్ధ చంద్రాకృతిలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే పట్టణానికి కొత్త శోభ రానుంది.


కందుకూరుకు వెలుపల జరుగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణం

నిమ్మ ధరలు (కిలో)
పెద్దవి : రూ.38
సన్నవి : రూ.20
పండ్లు : రూ.7



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 150



వైభవంగా కోటి కుంకుమార్చన



పూజలు చేస్తున్న దృశ్యం


గోపూజ చేస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో కోటి కుంకుమార్చన వైభవంగా జరుగుతోంది. సోమవారం ఉదయం వివిధ పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సుమారు 100 మంది రుత్వికుల చేత కోటి కుంకుమార్చన మహా యజ్ఞ కార్యక్రమాన్ని జరిపారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణం తదితర పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురికి వస్త్రదానాలు చేయగా, విదేశాలకు వెళ్లే యువతులు అమ్మవారి ఆశీస్సులను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆనంద్ సుధాకర్ – సాయిసత్య, రాజారెడ్డి – రమ దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నంద కుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ, ఉభయకర్తలు పాల్గొన్నారు.

రూ.30 లక్షల నిధులు మంజూరు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి సోమవారం జెడ్పీ నిధులు రూ.30 లక్షలను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సోమవారం విడుదల చేశారు. మంజూరు పత్రాలను చిల్లకూరు జెడ్పీటీసీ సభ్యుడు ఎం.శీనయ్యకు అందజేశారు. కలవకొండలో కొన్నేళ్లుగా తాగునీరు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ద్వారా జెడ్పీ సమావేశాల్లో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో జెడ్పీ నిధుల నుంచి రూ.30 లక్షల నిధులు మంజూరు చేసి, అందుకు సంబంధించిన మంజూరు పత్రాలను నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య, తొణుకుమాల ఎంపీటీసీ సభ్యుడు ఎల్లసిరి జానకిరామ్, ఉడతా శ్రీనివాసులకు అందజేశారు. కలకొండ సర్పంచ్ ఉడతా సుభాషిణి జెడ్పీ చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


నిధుల మంజూరు పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

జాబ్‌మేళా రేపు

గూడూరురూరల్: పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ చదివి 25 ఏళ్లలోపు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 78426 48484 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని అచ్చుకట్ల గ్రామానికి చెందిన వేనాటి చంద్రారెడ్డి, వేనాటి ఇంద్రసేనారెడ్డి సోదరులు రూ. లక్ష నగదు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ సిబ్బందికి అందజేశారు.

చివరిదశకు పొగాకు వేలం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలం చివరిదశకు చేరుకుంది. సోమవారం నుంచి ఒక్కో బ్యారెన్ గల రైతుకు 10 బేళ్ల చొప్పున వేలానికి అనుమతిస్తున్నామని వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 25న పొంగూరు, 26న తిక్కవరం, 27న గుండెమడగల, 28న డీసీపల్లి, 31న నెల్లూరుపాళెం క్లస్టర్ల పరిధిలోని పొగాకు రైతులు తమ వద్దనున్న పొగాకు నిల్వలను పొగాకు బోర్డు ఫీల్డ్ ఆఫీసర్లకు తెలియజేసి అదనపు అమ్మకాలకు అనుమతులు తీసుకోవాలని కోరారు.



1,179 బేళ్ల కొనుగోలు

డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతుల వద్ద నుంచి 1,179 పొగాకు బేళ్లు కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 1,252 బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకొచ్చారన్నారు. కిలో పొగాకుకు అత్యధికంగా రూ.250, అత్యల్పంగా రూ.150, సగటున రూ.231.84 ధర నమోదైందని రాజశేఖర్ తెలిపారు.